

# స్త్రీ నింద

– పూజిత

"ఊఁ పుణ్యం కొద్దీ పురుషుడు- దానం కొద్దీ బిడ్డలు అన్నారు. ఆడదంటే ఆ రెండూ చేసి పుట్టాలి." అంది కమలమ్మ పెరట్లో తడిచీర జాడించి తాడు మీద ఆరేస్తూ.

ప్రక్కనే తులసికోట దగ్గర- తులసి చెట్టుకు పూజచేస్తున్న రంజని ఇదేమీ పట్టించుకోకుండా పూజలో నిమగ్నమైవుంది. దాంతో కమలమ్మలోని 'అత్త అహం' దెబ్బతింది.

'ఎన్ని పూజలు చేస్తే మాత్రం ఏం లాభం? గొడ్రాలితనం పోవాలంటే పూర్వజన్మసుకృతం కావాలి గానీ, మొగుడ్ని కొంగున కట్టేసుకు తిరిగినంత మాత్రన బిడ్డలు పుట్టేస్తారా' అంది ఈసడింపుగా.

రంజని తులసిచెట్టుకి హారతి ఇచ్చి, చెట్టులో వుంచిన పూలలో ఓ మందార పువ్వు తీసుకుని కళ్లకద్దుకుని తల్లో తురుముకుని వంట ఇంటికేసి నడిచింది. ఆమె వంట ఇంటికేసి వెళ్తూంటే ఆమె కాలి పట్టీల మువ్వలు సవ్వడి చేశాయి.

రంజనికి పెళ్లైన కొత్తలో అయితే ఆ మువ్వల సవ్వడికి కమలమ్మ మురిసిపోయి- 'నువ్వు నడుస్తూంటే సాక్షాత్తు ఆ శ్రీమహాలక్ష్మీదేవే ఈ యింట్లో తిరుగాడుతున్నట్టుందే కోడలుపిల్లా' అని ఆమె బుగ్గలు పుణికి పుచ్చుకుని ముద్దు పెట్టుకునేది. కారణం – ఆమె తన వెంట తీసు కొచ్చిన గంపెడు కట్నం – బండెడు కానుకలు.

కాని- ఇప్పుడో ఆ మువ్వలసవ్వడి కమలమ్మకి కర్ణ కఠోరంగా వినిపించసాగింది. అయిన దానికీ, కాని దానికీ దెప్పిపొడుస్తూ, ప్రతి పనికీ వంకలు పెడుతూ ఆమెని హింసించడం ప్రారంభించింది. ఆరోజు కమలమ్మ కొడుకు ఆఫీసు పనిమీద బయటివూరు వెళ్లడంతో- ఆవిడ మరింత విజృంభించింది.

పెళ్లై మూడేళ్లైంది. ఇంతవరకూ ఈ యింట ఉయ్యాల కట్టలేదు. ఆ వనజమ్మ కోడల్ని చూడు- పెళ్లైన రెండేళ్లకే బంగారంలాటి కొడుకుని కన్నది. ఆ సూరమ్మ కోడలికైతే పెళ్లైన ఏడాదికే పనస పండులాంటి కూతురు పుట్టింది. పక్కింటి పాపాయమ్మ కోడలికి- ఏడాది తిరక్క ముందే రామలక్ష్మణుల్లాంటి కవలపిల్లలు పుట్టారు...." అంటూ పెరట్లోంచి ఇంట్లోకొచ్చి ముందుగదిలో నేలమీద కూలబడింది.

'అందుకే అత్తయ్యా ఈ దేశంలో జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. దాంతోపాటూ దరిద్రమూ పెరుగుతోంది. ముందీ కాఫీ తీసుకోండి'- అంది రంజని కమలమ్మకి కాఫీ గ్లాసు అందిస్తూ.

విసురుగా కాఫీగ్లాసు అందుకుని- రెండు గుటకలు మింగి అసహనంగా- 'ఇంతేసి పంచదార గుమ్మరించుకుని కాఫీలు తాగితే కొంపగుండమైపోదూ- ఆడదానికి పొదుపు చాలా అవసరం. ఎంత పిల్లా పీచూలేని సంసారమైతే మాత్రం ఇంత దుబారా చేసుకుంటారా ఎవరైనా? చివరకి మిగిలేది ఖాళీ డబ్బానే' అని సాగదీసింది.

'రేపట్నుంచీ పంచదారలేని కాఫీయే ఓ పూట మాత్రమే తాగుదాం. డబ్బాలే ఖాళీ కావు' అంది రంజని కాస్త గట్టిగా- అంతకు ముందు రోజు కాఫీలో పంచదార తక్కువైందని అత్తగారు చేసిన రాద్ధాంతాన్ని గుర్తుకు తెచ్చుకుని.

ఊహించని విధంగా, కోడలి నుండీ పెడసరంగా సమాధానం రావడంచూసి కమలమ్మ విస్తుబోయింది.

'ఇన్నాళ్లూ దీని ..ట్లో నాలికలేదని అను కున్నాను. కాని ఈ మధ్య మాటకి మాట బదులు చెప్పడం నేర్చుకుంది. దీనికంతటికీ కారణం- దీని చెల్లెలు- రమ్య ప్రభావమే! ఎప్పుడూలేంది ఈ మధ్య అది ఆడపాదడపా వచ్చి వెధవ సలహాలన్నీ దీనికిస్తోంది కాబోలు. అందుకే తిరగబడుతోందీ మధ్య' అని దభీమని కాఫీ గ్లాసు నేలమీద పెట్టింది. కోడలికోసం అటూ ఇటూ చూసింది. ఎక్కడా ఆమె అలికిడి లేదు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేని కమలమ్మ లేచి వెళ్లి టి.వి. ఆన్ చేసింది. టి.వి.లో యోగాసనాలు చూపిస్తున్నారు. విసుక్కుంటూ టి.వి. కట్టేసింది.

అంతలోనే వాకిట్లోంచి నవ్వులు వినిపించాయి. 'ఎవరా!' అని వీధి గుమ్మం కేసి తొంగి చూసింది కమలమ్మ.

రమ్య- రంజని నవ్వుకుంటూ లోపలికి వస్తున్నారు. వాళ్లని వాళ్ల నవ్వుల్ని చూడగానే అరికాలిమంట నెత్తికెక్కింది కమలమ్మకి.

'కొంపలంటుకు పోతున్నట్టు ఇంత పొద్దున్నే తగలడిందేమిటబ్బా ఈ పిశాచి పిల్ల' అనుకుంటూ మొహం తిప్పేసుకుంది.

అప్పుడే ముందుగదిలోకి అడుగుపెడుతున్న రమ్య- "ఏమిటండీ అత్తయ్యగారూ! చాలా కోపంగా వున్నారు!" అని పలకరించింది కమలమ్మని.

కమలమ్మ నోరు మెదపకుండా- ముభావంగా కూచుంది. పరిస్థితి అర్థంకాని రమ్య- "ఏమిటే అక్కయ్యా! మీ అత్తగారు సత్యభామపోజులో వున్నారివాళ!" అంది నెమ్మదిగా.

"ఏముందీ- ఎప్పుడూ వుండే గోలే కదా! పిల్లా పీచూలేరని!" అంది రంజని బాధ, విసుగు ధ్వనించిన స్వరంతో.

'అత్తయ్యగారూ' అని పిలుస్తూ వెళ్లి కమలమ్మ పక్కన కూచుని- 'ఇదుగో అత్తయ్యగారూ! మా అక్కయ్యకి చేయించిన స్టెరిలిటీ టెస్ట్ రిపోర్టు. అంటే... పిల్లలు పుడతారా లేదా అనే పరీక్ష తాలూకు ఫలితం.' అని తన వానిటీ బేగ్‌లోంచి ఓ కవర్ తీసి కమలమ్మకి ఇవ్వబోయింది రమ్య.

ఆ కవరుకేసి చూడనైనా చూడకుండా, 'ఊఁ ఏముందీ చూడ్డానికి ఆ రిపోర్టులో- పిల్లలు పుట్టరనేగా. నే మొదట్నుంచీ చెప్తూనే వున్నాగా. ఆ మాత్రం దానికి టెస్టులు గిస్టులూ అంటూ ఈ అనవసరమైన తతంగమంతా ఎందుకూ కొత్తగా. దేనికైనా పెట్టిపుట్టాలి' అంది నిష్ఠూరంగా, నిట్టూరుస్తూ.

'అది కాదత్తయ్యగారూ!' నేచెప్పేది పూర్తిగా వినండి. పిల్లలు పుట్టకపోవడానికి కారణం- మా అక్కయ్యలో లోపంకాదు. కాని- బావగారు కూడా

సెమన్ ఎనాలిసిస్ టెస్ట్ చేయించుకుంటే ఆ రిపోర్టు చూస్తే అసలులోపం ఎవరిలో వుందో అర్థమవుతుంది మీకు'- అంది రమ్య.

'నా ముందరే ఇంతమాట అనడానికి నీకెంత ధైర్యమే! నువ్వెంత డాక్టరువైతే మాత్రం మరీ ఇంత ఇదిగా మాట్లాడతావా! మా అబ్బాయంటే ఏమను కున్నావే! మీ అక్కయ్యలో వున్న లోపాన్ని కప్పి పుచ్చుకోడానికి తప్పుడు రిపోర్టు తీసుకొచ్చి- లోప మంతా మా అబ్బాయిలోనే వుందని అభాండాలు వేస్తావా! ఇంకోసారి ఈ మాటన్నావంటే నిన్నీ గడపలో కాలుపెట్టనివ్వను జాగ్రత్త.' అంది ఉక్రోషంతో కమలమ్మ.

'అయ్యో మీకెలా నచ్చజెప్పాలో నాకర్థం కావట్లే దత్తయ్యా. పిల్లలు పుట్టక పోవడానికి కారణం భార్యాభర్తలిద్దరి లో ఏ ఒకరిలోనో లోపం వుందని కాదు నే చెప్పేది అర్థం చేసుకోండి' అంది రమ్య అసహనంగా.

'అర్థమైందిలే తల్లీ.. ముందు నువ్విక్కడ్నుంచి బయటికి పో.' అంది కమలమ్మ తీవ్ర స్వరంతో.

కమలమ్మ కోపాన్ని చూసి- మరింత రెచ్చి పోయింది రమ్య.

'మీ అబ్బాయిని పరీక్ష చేయించుకోమంటేనే మీరిలా కస్సుమని లేస్తున్నారే! మరిమా అక్కయ్యలో ఏ లోపమూ లేదు మొర్రో అని ఎంత మొత్తుకున్నా వినిపించుకోక దాన్ని రాచిరంపాన పెట్టడం న్యాయమేనా?" రెట్టించింది.

ఇద్దరి మధ్య వాదోపవాదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇక లాభం లేదని- అంత వరకూ మౌనంగా వున్న రంజని వారిద్దరినీ సమాధాన పరచి- చెల్లెల్ని ఇంటికి పంపించేసింది

• • •

ఓ రోజు ఉదయం రంజని వాంతి చేసుకుంది. అది చూసి కమలమ్మ తనకి మనవడో, మనవరాలో పుట్టబోతున్నారని మురిసిపోయింది. కానీ- రంజని భర్త రాజశేఖర్ విస్తుపోయాడు. 'ఇదెలా సాధ్యం' అని తనలో తాను మధన పడి చివరకి మనసు ఉండబట్టలేక- 'రంజనీ! ఏమిటిది!' అన్నాడు ఆదుర్దాగా.

'అదేమిట్రా అలా అడుగుతున్నావు నీ యిల్లు బంగారంగానూ. ఇన్ని రోజులూ పిల్లలు కలగ లేదని దాన్ని ఆడిపోసుకున్నాను. ఇన్నాళ్లకి నీ పెళ్లాం నీళ్లోసుకుందని నేనెంతో సంబరపడు తూంటే.. నువ్వేమిటీ ఇలా అంటున్నావు!' అంది కమలమ్మ కొడుకు పరిస్థితి అర్థంకాక.

'ఏమిటండీ ఇది. నేను... తల్లిని కావడం మీ కిష్టంలేదా?' అని నిలదీసింది రంజని భర్తని.

ఏం సమాధానం చెప్పాలో తెలీక- రాజశేఖర్ మొహాన్ని కందగడ్డలా చేసుకుని- గిర్రున వెనక్కి తిరిగి, బయటికి వెళ్లిపోయాడు.

ఉదయమనగా వెళ్లిన రాజశేఖర్ రాత్రి బాగా పొద్దుపోయాకగాని ఇంటికి రాలేదు. రాత్రి రంజని నిద్రపోతున్న సమయంలో రాజశేఖర్ తన మనసులో దాచుకున్న నిజాన్ని తల్లి ముందు ఏకరువు పెట్టాడు. కొడుకు చెప్పిన దంతావిన్న కమలమ్మ గుండెలు బాదుకుంది. 'ఎంతకు తెగించావే నంగనాచి' అని కోడల్ని దుమ్మెత్తి పోసింది.

'అసలు నా కొడుక్కి పిల్లలు పుట్టరని ఏవేవో టెస్టులు చేసి చెప్పార్ట డాక్టర్లు. మరి నీకెలా వచ్చిందే ఈ మాయదారి కడుపు..' అని నిద్ర పోతున్న రంజనిని పట్టుకుని గుంజాడించింది.

నిద్రమత్తులో మొదట పరిస్థితి అర్థంకాక పోయినా ఆ తర్వాత పరిస్థితిని అర్థంచేసుకుని- 'నే చెప్పేది కాస్త నిదానంగా వినండత్తయ్యా!' అని సమాధానపరచడానికి ప్రయత్నించింది రంజని.

'ఇంకేముందే వినడానికి- పైకి నంగనాచిలా కనిపిస్తూ- లోపల్లోపల ఎంత పని చేశావే దౌర్భాగ్యురాలా! ఈ విషయం బయటికి పొక్కిందంటే- మన ఇంటి పరువు, మర్యాద ఏం కావాలి! ఇక నువ్వు ఈ యింట్లో ఒక్క క్షణం కూడా వుండడానికి వీల్లేదు- ఫో బయటికి-' అని రంజనిని గుమ్మంలోంచి వీధిలోకి నెట్టేసింది.

'శభాష్ అత్తయ్యగారూ!' అంటూ అప్పుడే గేటు తెరచి లోపలికొస్తున్న రమ్య, రంజని కింద పడ కుండా పట్టుకుని ఆపింది.

'ఇంత రాత్రప్పుడు తగలబడ్డావు. ఇంకా ఏముందే ఇక్కడ తగల బెట్టడానికీ- అక్కా చెల్లెలూ కలసి సిగ్గు లజ్జా వదిలేసి- ఎంతకు తెగించారే' అని మీద మీదకి వెళ్లింది కమలమ్మ

'స్త్రీకి స్త్రీయే శత్రువు అన్న మాటని మీరు అక్షరాలా ఋజువు చేస్తున్నారు అత్తయ్యగారూ! మీలాంటి వాళ్లుండబట్టే- స్త్రీ జాతి ఈనాడు అనేక నిందలు మోస్తోంది. ఆ రోజుల్లో పిల్లలు పుట్టక పోతే ఆడదాన్లో లోపం వుందని మగాడు మరో పెళ్లి చేసుకునేవాడు. బిడ్డలు లేని స్త్రీని గొడ్రాలుగా నీచంగా చూచేవారు. కానీ ఈ రోజుల్లో విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. ఆ విజ్ఞానంతో పిల్లలు పుట్టకపోవడానికి భార్యాభర్తల్లో ఎవరిలో లోపం వుందో తెలుసుకోగలుగుతున్నారు. దానినిబట్టి- తగిన చికిత్స చేసి- వారికి సంతానం కలిగేలా చేస్తున్నారు. కానీ మీలాంటివాళ్లు ఇంకా ఆ పాత కాలం మత్తులోంచి బయటపడక సాటి స్త్రీనే నిందిస్తున్నారు. పోనీ మీరు పాత తరానికి చెందినవారు అనుకున్నా, మరి మీ అబ్బాయి... ఈ తరానికి చెందినవారే కదా! నేటి పరిస్థితులు పూర్తిగా అవగాహన చేసుకున్నవారే కదా! అయినా ఇలా ప్రవర్తిస్తున్నారంటే అసలు ఆయనగారి ఉద్దేశం ఏమిటో అర్థం కావడంలేదు-

'చెప్పండి బావగారూ! మా అక్కయ్యని మీరు అనుమానించడంలో మీ ఉద్దేశం ఏమిటి? మీ అమ్మగారు మా అక్కయ్యని నానామాటలూ ఆడి - హింసిస్తూ వుంటే - నిజం తెలిసీ మీరు నిమ్మకెత్తిన నీరులా మౌనంగా వుండడానికి కారణం ఏమిటి? నిజం తెలిస్తే మా అక్క భరించిన నిందలన్నీ మీరు భరించాల్సి వస్తుందని భయమా! ఎంత స్వార్థ మండీ మీలో. అక్కయ్యని ఏంచేస్తారోననే భయంతో నేనే రావాల్సివచ్చింది" అని రాజశేఖరాన్ని నిలదీసి అడిగింది.

రాజశేఖర్ మౌనంగా తలదించుకుని నిలు చున్నాడు. అతని మౌనం రమ్యని మరింత రెచ్చ గొట్టింది.



కూరగాయలు కొన్నప్పుడు పచ్చి మిరపకాయలు, చిక్కుడు కాయలు, బీన్స్, గోరు చిక్కుళ్ళు, బఠాణీలు లాంటివి వేర్వేరు పోలిథిన్ కవర్లలో వేసు కుంటే, ఇంటికి వచ్చిన తరువాత కూర గాయలను వేరు చేసే శ్రమ ఉండదు.

—శారదా దీపక్

'మీరు చెప్పండి అత్తయ్యగారూ! ఆ రోజు మీకు నిజం తెలీక మా అక్కయ్యని నిందించారు. ఈ రోజు అసలు లోపం ఎవరిలో వుందో మీకు తెలిసింది. అయినా- మీ అబ్బాయిని పల్లెత్తు మాట అనకుండా మళ్లీ- కోడలిమీదనే నింద మోపుతున్నారు. ఇదెక్కడి న్యాయమండీ!' అని కమలమ్మని ప్రశ్నించింది.

'ఇది మరీ బావుందమ్మాయ్! నువ్వెంత డాక్టర్వైనా, ఎన్ని విషయాలు నీకు తెలిసినా, మీ అక్కయ్య చేసిన పనేమన్నా బావుందా!'

'మా అక్కయ్యేం చేసింది'

'ఏం చేసిందని అంత తేలిగ్గా తీసిపారేస్తున్నావే- నాలో స్వార్థమో- పిరికితనమో నా మౌనానికి కారణం కావచ్చు. అయితే దానికి ఇంత దారుణంగా శిక్ష విధించాలా..!' అని ప్రశ్నించాడు రాజశేఖర్ క్రోధం, దుఃఖం నిండిన గొంతుతో.

పక పకా నవ్వింది రమ్య.

'పిచ్చిబావగారూ! మీరంతా అనుకుంటున్నట్టు మా అక్కయ్య నిజంగా గర్భవతి కాదు'

రాజశేఖర్, కమలమ్మ బిత్తరపోయి చూశారు. ఇంకా వాళ్లల్లో అనుమానపు ఛాయలు తొలగ లేదు.

వాళ్ల చూపుల్లోని అర్థాన్ని గ్రహించిన రమ్య-

"మీలో ఉన్న పిరికితనాన్ని, స్వార్థాన్ని పోగొట్టి, నిజాన్ని మీ నోటి నుంచే పలికించి, మీకు కనువిప్పు కలిగించాలనే ఉద్దేశంతో నేనూ, మా అక్కయ్య చిన్న నాటకం ఆడాం. నిజంగానే మా అక్కయ్య గర్భవతి కాదు. కేవలం నటన మాత్రమే! ఈ నాటకానికి నేనే సూత్రధారిని. ఇందులో మా అక్కయ్య తప్పేమీ లేదు. ఇప్పటికైనా మీ తల్లీ కొడుకులూ ఇద్దరూ యదార్థాన్ని తెలుసుకొని మా అక్కయ్యని హింసించకూడదనే నా తాపత్రయం. బావగారు ఒప్పుకుంటే అక్కయ్య అనాథపిల్ల లెవరినైనా పెంచుకోడానికి సిద్ధంగా వుంది. మరి ఈ తల్లి కొడుకులు ఏమంటారో?" అంది రమ్య.

ఇంతవరకూ రమ్య ఆడింది నాటకం అని తెలిసిన తల్లీ కొడుకుల ముఖాలు చేదు మాత్ర మింగినట్లు ముడుచుకుపోయాయి. ✦